ప్రజాశక్తి

శనివారం 17 జూన్ 2023 5 శ్రీకాకుళం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

# మాతా శిశు మరణాలు ఉండకూడదు

- తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలి
- వైద్యులు సమయపాలన పాటించాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత పిహెచ్‌సి, సిహెచ్‌సి వైద్యులపై ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్పష్టం చేశారు. జిల్లాలో మాతాశిశు మరణాల నివారణ, ఇతర అంశాలపై వైద్యాధికారులు, పిహెచ్‌సి, సిహెచ్‌సి వైద్యులు, సిబ్బందితో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు పలు కారణాలతో సంభవించిన మాతా శిశు మరణాలపై కలెక్టర్ అరా తీశారు. మాతాశిశు మరణాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు సమయపాలన పాటించడం లేదని, ఆదివారం, సెలవు రోజుల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయన్నారు. వైద్యులు తమకు కేటాయించిన విధులకు తప్పక హాజరు కావాలని, సాయంత్రం నాలుగు గంటల వరకు విధుల్లో కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరైన, సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో మాతాశిశు మరణాల నివారణకు వైద్యులు అంకితభావంతో పనిచేయాలన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మరణాలు సంభవిస్తున్నాయనే భావన ప్రజల్లో ఉండరాదని హితవు పలికారు. హైరిస్క్ కేసులను ముందుగా గుర్తించి సాధ్యమైనంత మేరకు ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించాలని చెప్పారు. తల్లిపాల ఆవశ్యకతపై తల్లులకు వివరించాలని, ఈ విషయంలో ఎఎన్ఎంలు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పిహెచ్‌సి స్థాయిలో ప్రతి వారం సమావేశాలు ఏర్పాటు చేసి తల్లిపాల ఆవశ్యకతపై చైతన్యపరచాలన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జిల్లా మాస్ మీడియా అధికారి పి.వెంకటరమణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆర్.వి.ఎస్ కుమార్, ఉప వైద్యారోగ్యశాఖ అధికారి లక్ష్మీతులసి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి గైనకాలజిస్ట్ పార్వతి, పిహెచ్‌సి, సిహెచ్‌సిల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల దందా

- అడ్డగోలుగా వసూలు
- నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, నోటు బుక్స్ విక్రయాలు
- అడిగే వారు లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలు

**పాఠశాలలు పున: ప్రారంభం కావడంతో ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల దోపిడీ పర్వానికి తెరతీశాయి. కరోనా కారణంగా రెండేళ్లుగా ఫీజులు పెంచేందుకు వెనకాడిన యాజమాన్యాలు ఇప్పుడు కనికరం లేకుండా పెంచేశాయి. పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ ధరలనూ పెంచి తమ గల్లా పెట్టెను నింపుకుంటున్నాయి. పుస్తకాలు, యూనిఫాం విక్రయించకూడదని నిబంధనలు చెప్తున్నా బేఖాతరు చేస్తున్నాయి. ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేకపోవడంతో ప్రయివేట్ యాజమాన్యాల దోపిడీకి అడ్డగోలుగా దోపిడీ సాగిస్తున్నాయి. ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు వసూళ్లు చేస్తున్న సొమ్ములు భారీగా ఉండడంతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు నలిగిపోతున్నారు.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,053 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 1995, ప్రాథమికోన్నత పాఠశాలలు 469, ఉన్నత పాఠశాలలు 589 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 2,655 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 1916, ప్రాథమికోన్నత 332, ఉన్నత పాఠశాలలు 407 ఉన్నాయి. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలలు 398 ఉన్నాయి. వాటిలో ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ 394, సిబిఎస్ఇ సిలబస్‌తో నడుస్తున్న ప్రయివేట్ అన్ ఎయిడెడ్ నాలుగు ఉన్నాయి. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో కలిపి మొత్తం 2,90,859 విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో 2,01,993 మంది, ప్రయివేట్ పాఠశాలల్లో 88,866 మంది విద్యనభ్యసిస్తున్నారు.

### భారీగా ఫీజుల వసూలు

విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీకి తెరలేపాయి. పరీక్షల్లో ఫలితాలు, స్కూళ్ల స్ట్రెంత్, పేరెంట్స్ మోజు బట్టి యాజమాన్యాలు ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఫీజులు కొంతవరకు అందుబాటులో ఉన్నా పట్టణ, నగర పరిధిలోని స్కూళ్లలో మాత్రం భారీగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయివేట్ స్కూళ్లలో ఎల్‌కెజి విద్యార్థికి గరిష్టంగా రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. పలాస, టెక్కలి, ఆమదాలవలస వంటి ప్రాంతాల్లో ఎల్‌కెజి విద్యార్థికి రూ.20 వేల వరకు తీసుకుంటున్నారు. శ్రీకాకుళం నగరంలో మాత్రం భారీగా ఫీజులు ఉన్నాయి. ఎల్‌కెజి విద్యార్థికి ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. శ్రీకాకుళం నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన కొన్ని స్కూల్‌లో యాజమాన్యాలు వసూలు చేస్తున్న ఫీజులు వింటే కళ్లు బైర్లు కమ్ముతాయి. శ్రీకాకుళం నగరంలోని డిసిసిబి కాలనీ సమీపంలోని ఒక ప్రయివేట్ పాఠశాల ఎల్‌కెజి విద్యార్థికి రూ.80 వేలు వసూలు చేస్తుండగా, మండల వీధిలోని మరో ప్రయివేట్ స్కూల్‌లో రూ.50 వేలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

### పుస్తకాల ధరలనూ పెంచేశారు

ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో వారి చెప్పిందే ధరగా ఉంటోంది. ఈ ఏడాది 30 నుంచి 40 శాతం వరకు పుస్తకాల ధరలను పెంచేశారు. ప్రభుత్వ పుస్తకాలు మినహా వారి సిలబస్‌కు సంబంధించిన పుస్తకాలు, నోట్‌బుక్స్ తమ స్కూళ్లలో కొనాల్సిందేనని యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో బయట మార్కెట్‌తో పోలిస్తే ప్రయివేట్ స్కూళ్లలో ధరలు ఎక్కువగా ఉన్నా తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే కొంటున్నారు. శ్రీకాకుళం నగరంలోని అఫీషియల్ కాలనీలో ఉన్న ఒక ప్రయివేట్ స్కూల్‌లో గత సంవత్సరం మూడో తరగతి పుస్తకాలకు రూ.2,100 వసూలు చేయగా, ఈ ఏడాది రూ.2,900 తీసుకుంటున్నారు. నోట్ పుస్తకాల ధరలనూ పెంచేశారు. బయట మార్కెట్‌లో రూ.25 ఉండే నోట్ పుస్తకాన్ని రూ.36 తీసుకుంటున్నారు. మహాలక్ష్మినగర్ కాలనీలోని ఒక కార్పొరేట్ స్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థికి గతేడాది రూ.4,200 తీసుకోగా, ఈ సంవత్సరం రూ.5,100 వసూలు చేస్తున్నారు.

### జూన్ వచ్చిందంటే తల్లిదండ్రుల్లో టెన్షన్

స్కూళ్లు తెరుస్తున్నారంటే చాలు తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలవుతుంది. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని, తాము సరిగా చదువుకోలేకపోయినా వారిని బాగా చదించాలని కోరుకుంటున్న తల్లిదండ్రులు నలుగురితో పాటు వారి పిల్లలనూ ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదివిస్తున్నారు. ముఖ్యంగా చిరుద్యోగులు, ప్రయివేట్ ఉద్యోగులు తమ జూన్ నెల జీతం వంతా వాచ్చించినా చాలకపోవడంతో అప్పు చేసి మరీ ఫీజులు కడుతున్నారు.

### అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

పాఠశాలలు తెరవగానే ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజ్‌లు అడ్డగోలుగా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. పుస్తకాలు, నోట్ బుక్స్‌ను అధిక ధరలకు అమ్ముతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో ఎటువంటి అమ్మకాలు చేపట్టకూడదు. అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

**- సిహెచ్.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు**

### తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు

ప్రయివేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఫలానా స్కూల్‌లో ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారని లిఖితపూర్వకంగా రాసిస్తే చర్యలు చేపడతాం. ఫీజుల వివరాలకు సంబంధించి స్కూళ్లలో తప్పనిసరిగా బోర్డులు ప్రదర్శించాలి. పాఠశాల్లో పుస్తకాలు, యూనిఫారాలు విక్రయించడం నిబంధనలకు విరుద్ధం.

**- తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖ అధికారి**

# జీడికి రూ.16 వేలు ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి - పలాస

మాట్లాడుతున్న అజయ్ కుమార్

లాభాలు రుచి మరిగిన జీడి వ్యాపారులు మరో మోసానికి తెర తీశారని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్ కుమార్ విమర్శించారు. మండలంలోని బొడ్డపాడులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాను రూ.ఎనిమిది వేలకు కొనుగోలు చేస్తామని చెప్పడం ఇందులో భాగమేనన్నారు. గతంలో రైతులు, వ్యాపారుల మధ్యనే వ్యాపార లావాదేవీలు ఉండేవని, దళారీ వ్యవస్థను వ్యాపారస్తులే సృష్టించి భారీ మోసాలకు తెర లేపారని విమర్శించారు. జీడిపప్పు రేటు, రైతు సాగు ఖర్చును పరిగణనలోకి తీసుకుని పిక్కల ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. వ్యాపారులు ఈ స్థాయికి చేరారంటే అందుకు రైతులే కారణమని, వారిని ముంచేసే విధంగా వ్యాపారాలు చేయకూడదని హితవు పలికారు. స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజు జోక్యం చేసుకుని బస్తాకు రూ.16 వేల మద్దతు ధర కల్పించడంతో పాటు రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్ పోరాటాలకు రైతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# కార్పొరేట్ ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

## రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

పురస్కారాన్ని అందిస్తున్న మంత్రి అప్పలరాజు

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన సాగుతోందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పదోతరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం ఇందుకు నిదర్శనమన్నారు. జగనన్న ఆణిముత్యాలులో భాగంగా కాశీబుగ్గ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం మిగతా విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలదొక్కుకోవాలని సూచించారు. గతంలో చెట్ల కింద చదువులు సాగేవని, నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలే మారిపోయాయని చెప్పారు. అమ్మఒడి, వసతి దీవెన, విద్యా దీవెన వంటి పథకాలతో ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. అనంతరం ప్రతిభ సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో డిఇఒ తిరుమల చైతన్య, డిప్యూటీ డిఇఒ జి.పగడాలమ్మ, ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, తులసీరావు, లక్ష్మణరావు, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, ఎఎంసి చైర్మన్ పి.వి సతీష్, పలాస ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మందస ఎంపిపి డొక్కర దానయ్య, నాయకులు, అధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పొందూరు

మృతుడు శ్రీరామ్మూర్తి

వడదెబ్బకు శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలోని తుంగపేటకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఇలపండ శ్రీరామ్మూర్తి (43) శుక్రవారం మృతి చెందాడు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం సిరిపురంలో భవన నిర్మాణ పనులకు వెళ్లిన శ్రీరామ్మూర్తి పనిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురై పడిపోయాడు. సహచర కార్మికులు పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి శ్రీకాకుళంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య మేఘన, కుమార్తె, రెండు నెలల బాబు ఉన్నారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఓటర్ల మార్పులు, చేర్పుల్లో జాగ్రత్తలు అవసరం

**శ్రీకాకుళం అర్బన్ :** ఓటర్ల జాబితా సవరణల్లో భాగంగా మార్పులు, చేర్పుల్లో మరిన్ని జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. జిల్లా ఉన్నతాధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఎన్నికలకు సంబంధించి ఎస్ఎస్ఆర్-2024పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాలో ప్రస్తుతం 1395 పెండింగ్ క్లయిమ్స్ ఉన్నాయని, వాటిని షెడ్యూల్ ప్రకారం క్లియర్ చేస్తామని తెలిపారు. డోర్ నంబర్లు, వందేళ్ల వయసు పైబడ్డ వారిని డోర్ టు డోర్ సర్వేలో క్లియర్ చేస్తామన్నారు. ఎలక్షన్ పిటిషన్‌లో ఉన్న ఇవిఎంలు ప్రయివేటు కళాశాలలో ఉన్నాయని, వాటిని ప్రభుత్వ కళాశాలకు షిఫ్టింగ్ చేయడానికి అనుమతించాలని కోరారు. మున్సిపల్ పరిధిలో ఉన్న షెల్టర్ లేని ఎలక్ట్రోలర్స్‌ను గుర్తించడానికి 2024 షెడ్యూల్ ప్రకారం ఎన్‌రోల్ చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు డోర్ టు డోర్ సర్వేలో తప్పక పర్యవేక్షించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి డిఆర్ఒ పి.మురళీకృష్ణ, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

# 23 నుంచి జగనన్న సురక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం, అర్హులందరికీ పథకాలను అందించడమే లక్ష్యంగా ఈనెల 23 నుంచి జులై 23వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ఈ కార్యక్రమం పటిష్టంగా అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమంపై కలెక్టరేట్ నుంచి జిల్లా ఉన్నతాధికారులు, మండల ప్రత్యేక అధికారులు, కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరించాలన్నారు. మండలస్థాయిలో ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దార్‌తో కూడిన బృందం, తహశీల్దార్ పంచాయతీరాజ్ ఇఒతో కూడిన మరో బృందం ప్రతిరోజూ సచివాలయాలను సందర్శిస్తాయని తెలిపారు. సమస్యలున్న వారిని సచివాలయాల వద్దకు తీసుకువచ్చి వారికి కావాల్సిన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు అన్నీ అందించనున్నట్లు చెప్పారు. సచివాలయంలో ప్రత్యేక డెస్క్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది బృందంగా వార్డుల్లో పర్యటిస్తారని తెలిపారు. జగనన్న సురక్షలో పలు పథకాల కింద అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు ఒకటో తేదీన మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి డిఆర్ఒ మురళీకృష్ణ, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం కాలువను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

# శివారు భూములకు నీరందించాలి

**ఎచ్చెర్ల :** నారాయణపురం కాలువ మరమ్మతులు చేసి చివరి భూములకు సాగునీరు అందించకపోతే ప్రజల మద్దతుతో ఉద్యమాలు చేపడతామని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షులు పొందూరు చంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఫరీదుపేట నుంచి ధర్మవరం వరకు కాలువను సుమారు 14 కిలోమీటర్లకు పైగా శుక్రవారం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు నాయకుల దృష్టికి అనేక సమస్యలను తీసుకొచ్చారు. దుప్పలవలస వంతెన దగ్గర సిమెంట్ కట్టడం కూలి కాలువకు అడ్డంగా ఉండిపోవడంతో నీరు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. జాతీయ రహదారి పై ఓవర్ వద్ద మట్టి పూడుకుపోయిందన్నారు. ఫరీదుపేట నుంచి ధర్మవరం వరకు కాలువలో గుర్రపుడెక్క, తూటికాడ, చెట్లతో కాలువ అంతా నిండిపోయిందని, నీరు విడిచిపెడితే చివరి భూములకు నీరు ఎలా వస్తుందని వాపోయారు. పొన్నాడ సబ్ ఛానల్ వద్ద షట్టరు లేకపోవడంతో ముద్దాడ, ధర్మవరం, రామజోగిపేట తదితర గ్రామాలకు నీరు వెళ్లే అవకాశం లేదని చెప్పారు.

ఇబ్రహీంబాద్ వద్ద గెడ్డ గట్టు పైన డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల చెత్త అంతా కాలువకు అడ్డంగా పేరుకుపోతోందని తెలిపారు. నవభారత్ వద్ద కాలువ గట్టుపై సుమారు 42 ఇళ్లు నిర్మించడంతో కాలువ కుదించుకుపోయిందన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపించి కాలువ విస్తరణ పనులు చేపట్టాలని చెప్పారు. లస్కర్లకు రెండేళ్లుగా జీతాలు ఇవ్వకపోవడంతో, కాలువ నిర్వహణ ఏవిధంగా జరుగుతుందని ప్రశ్నించారు. రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ దుప్పలవలస వద్ద కాలువలో కూలిపోయిన సిమెంట్ దిమ్మను తొలగించాలన్నారు. కాలువలో గుర్రపుడెక్క, మట్టి పూడికను యుద్ధప్రాతిపదికన తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు టి.నందోడు, జి.శ్రీరామ్మూర్తి, ఉంకిలి రాజేష్, ఎం.సత్యం, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి పెద్దపీట

ప్రజాశక్తి - పొందూరు

వరి విత్తనాలను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తండ్యాంలో రాయితీ వరి విత్తనాలను రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల నుంచి విత్తనాల పంపిణీ నుంచి పంట కొనుగోలు వరకు ప్రభుత్వమే చేస్తోందన్నారు. రైతుకు మేలైన మద్దతు ధర అందించడంతో పాటు దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రాయితీ వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ట్రిపుల్ ఐటిలో యోగా వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జగదీశ్వరరావు

ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఎం పురంలోని ట్రిపుల్ ఐటిలో యోగా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలి రోజు శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. యోగసనాలు వేయండి... ఆయుష్షు పెంచుకోండి అన్న నినాదాలతో విద్యార్థుల ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ కె.మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరినాయుడు, యోగా విభాగాధిపతి ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, డిఎస్‌డబ్ల్యు రవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.శ్రీనివాసరావు, డిఎఒ రఘుపతిరావు, పిఆర్ఒ మామిడి షణ్ముఖ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పథకాలపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన

## జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పలు పథకాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జెసి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ శాఖల్లోని రైతుల ప్రయోజనాల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నా, జిల్లా వెనుకంజలో ఉందని అభిప్రాయపడ్డారు. రైతుల్లో సరైన అవగాహన లేకపోవడమే కారణమని తేల్చిచెప్పారు. రైతుభరోసా కేంద్రం పరిధిలోని రైతులకు యంత్ర సేవా పథకం, పశు బీమా, పామాయిల్ సాగుతో అధిక లాభాలు, తక్కువ నీటితో వ్యవసాయ, ఉద్యానవన పంటల దిగుబడి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు.

వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు మాట్లాడుతూ జులై 8వ తేదీన వైఎస్సార్ జయంతి సందర్భంగా ఖరీఫ్ పంటల కోసం రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం పర్యవేక్షక ఇంజినీర్ మాట్లాడుతూ జులై 15వ తేదీ నాటికి సాగునీటిని రైతులకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా నీటిపారుదల సలహా మండలి చైర్‌పర్సన్ చల్లా అలివేలుమంగ, వ్యవసాయ మిషన్ సలహా మండలి సభ్యులు గొండు రఘురాం, వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్, ఉద్యానశాఖ అధికారి ఆర్.వి ప్రసాదరావు, రాగోలు వ్యవసాయ పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త పి.వి సత్యనారాయణ, మత్స్య, పశుసంవర్ధకశాఖ జెడిలు పి.వి శ్రీనివాసరావు, ఎం.కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మొదటి విడతలో 302 అక్రిడిటేషన్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న 302 మంది జర్నలిస్టులకు తొలి విడతలో అక్రిడిటేషన్లు జారీ చేసేందుకు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ శ్రీకేష్ లాఠకర్ ఆమోదించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్, డిఎంఎసి చైర్మన్ శ్రీకేష్ లాఠకర్ అధ్యక్షతన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు సంబంధించిన విషయాలపై చర్చించారు. జిఒ నంబరు 38ను అనుసరించి అక్రిడిటేషన్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను అర్హత గల జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరుకు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు కె.వేణుగోపాల్, కె.శివశంకర్, ఎన్.ఈశ్వరరావు, ఎస్.జోగినాయుడు, కె.జయశంకర్, ఆర్‌టిసి డిపో మేనేజర్, కె.ఆర్.ఎస్ శర్మ, ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా సమన్వయకర్త ప్రకాశరావు, డిఐపిఆర్ఒ ఎస్.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగన్నాథం

## రవాణా వ్యవస్థను మెరుగుపరచాలి

### శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జాతీయ రహదారులకు ధీటుగా రాష్ట్ర రహదారులను తీర్చిదిద్ది రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఇటీవల రహదారుల, భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఐ.వి.ఎస్.జగన్నాథం బాధ్యతలు స్వీకరించారు. ఇందులో భాగంగా స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ తమ్మినేని సీతారాంను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో జరిగే రహదారులు, ప్రభుత్వ భవన నిర్మాణాల విషయంలో నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలోని బలసలరేవు వంతెన, శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు నాలుగు లైన్ల రహదారుల నిర్మాణం, పురుషోత్తపురంలో సిహెచ్‌సి భవనాలతో పాటు రహదారుల భవనాల శాఖ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రహదారుల భవనాల శాఖ ఎఇ నాయక్ పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

## పక్కాగా 'ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్'

### వైద్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్టును పక్కాగా అమలు చేయాలని, సెకెండ్ మెడికల్ ఆఫీసర్లకు ఈ బాధ్యతలు అప్పగించాలని వైద్య, కుటుంబ సంక్షేమ శాఖల కమిషనర్ జె.నివాస్ ఆదేశించారు. డిఎంహెచ్‌ఒ, ఇతర అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి ఓపి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రానున్న రోజుల్లో వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఒ మీనాక్షి మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. ఇప్పటివరకు 11,223 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించామని వివరించారు. జిల్లాలో కుష్టువ్యాధి కేసులకు మెరుగైన వైద్యసేవలు అందించామని అన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ప్రయివేటు ఆస్పత్రుల్లో వచ్చిన కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఎంఎల్‌హెచ్‌పి, స్టాఫ్‌నర్స్, ఎల్‌టి, డాక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. ఎన్‌హెచ్‌ఎం నియామకైన ప్రతిఒక్క ఉద్యోగికీ సకాలంలో జీతం అందించాలన్నారు. సమావేశంలో డిఐఒ డాక్టర్ ఆర్.వి.ఎస్.కుమార్, జిల్లా మాస్మీడియా అధికారి పైడి వెంకటరమణ, డిఎంఒ సత్యనారాయణ, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ జె.కృష్ణమోహన్, శ్రీకాంత్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- నరసన్నపేట

రాష్ట్రంలో సస్యవిప్లవానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట మార్కెట్ యార్డులో రైతులకు శుక్రవారం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాటాల్డఉతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయం దండగ అంటూ రైతాంగంపై విషం చిమ్మారన్నారు. వ్యవసాయమే మన అభివృద్ధికి మూలమని తెలిసిన మన నాయకుడు జగన్.. ఈ నాలుగేళ్లలో వ్యవసాయాన్ని ఒక పండగలా మార్చారని అన్నారు. ప్రతి సచివాలయానికీ అనుబంధంగా రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి విత్తన పంపిణీ నుంచి చివరికి పంటని కొనుగోలు చేసేవరకూ అన్నదాతలకు అన్ని వేళలా అండగా నిలుస్తున్నారన్నారు. ఏడాదికి రూ.13,500 పెట్టుబడిసాయాన్ని రైతు భరోసాగా అందజేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం విత్తనాల కంపెనీలతో కుమ్మక్కై నాసిరకం విత్తనాలు ఇచ్చి రైతుల జీవితాలతో చెలగాట మాడిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, వైసిపి నాయకులు చింతు రామారావు, ఎఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, పంగ బావాజీనాయుడు, దాలి నాయుడు, శంకర్ పాల్గొన్నారు.

నరసన్నపేట : విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

**బూర్జ :** మండలంలోని పెద్దపేట సచివాలయం పరిధి రైతు భరోసా కేంద్రంలో పిఎసిఎస్ డైరెక్టర్ వావిలపల్లి గోవిందరావు రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ డి.వి.నాయుడు, వార్డు మెంబరు నడిమింటి వెంకటరమణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ వియ్యపు జగదీష్, వాలంటీర్ ముళ్ల రాంబాబు పాల్గొన్నారు.

**జలుమూరు:** మండలంలోని లింగాలవలస రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ అధ్యక్షుడు బుక్క లక్ష్మణరావు రైతులకు వరి విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. ప్రతి రైతుకూ విత్తనం, ఎరువులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఒ కె.సురేష్ పాల్గొన్నారు.

**కోటబొమ్మాళి:** మండలంలోని కొత్తపల్లి సచివాలయంలోని రైతులకు జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు విత్తనాలను పంపిణీ చేశారు. అలాగే కొత్తపల్లి, పాకివలస ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాదీవన కిట్లనూ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పార్వతీశం, రత్నాల లక్ష్మి మురళి, దండాసి సింహాచలం, దండాసి ఆదిలక్ష్మి, ముద్ద జయమ్మ, దండాసి కృష్ణవేణి పాల్గొన్నారు.

జలుమూరు : విత్తనాలను పంపిణీ చేస్తున్న లక్ష్మణరావు

## అధ్వానంగా తిలారు రోడ్డు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

నరసన్నపేట నియోజకవర్గంలోని తిలారు రోడ్డు అధ్వానంగా తయారైందని సిపిఐ నాయకులు లక్కోజి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం తిలారు రోడ్డును పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. నరసన్నపేట నుంచి పాతపట్నం, శ్రీముఖలింగం వైపు వెళ్లే వాహనాలు వల్ల నిత్యం రద్దీ ప్రాంతమైందన్నారు. ఈ రోడ్డు పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం ఇంతవరకు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇటువైపుగా వెళ్తున్న ప్రజాప్రతినిధులు గాని, అధికారులు గానీ ఈ రోడ్డును పూర్తి చేసే ప్రక్రియ ఇంతవరకు చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రయాణికులు నిత్యం దుమ్ము, ధూళితో వారి కళ్లు నిండుతున్నాయన్నారు. ప్రజలందరూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని, వెంటనే ఈ విషయంపై స్థానిక అధికారులు స్పందించి రోడ్డును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

# రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్త దానం చేసిన వారు మరొకారి ప్రాణాన్ని రక్షించేవారవుతారని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా టెక్కలి జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం అన్నది అన్నింటికన్నా మహా దానమని అన్నారు. ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు రక్త నిల్వలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి అందరిలో స్ఫూర్తిని నింపాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ సామాజిక స్పృహతో చేపట్టిన కార్యక్రమంతో మిగతా శాఖల వారు రక్త సేకరణ నిల్వలు చేపట్టాలన్నారు. రక్తదాన చేసిన సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి అట్లా సరోజనమ్మ, తహశీల్దార్ ప్రవల్లికాప్రియ, ఆస్పత్రి సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు, డాక్టర్ కణితి కేశవరావు పాల్గొన్నారు.

**పొందూరు:** రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణాన్ని కాపాడవచ్చునని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రామరావు అన్నారు. పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ రక్తనిధి దాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ సభ్యులు కాళ్లకూరి శాంతారాం మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో సుమారు 20 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పొందూరు రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ ప్రతినిధి కుమిలి రాజేష్, జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు డాక్టర్ పాత్రుడు, పవన్, ప్రకాష్, సాయి, మహేష్ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

# అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

పలాస : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

**పలాస :** అంగన్వాడీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనియెడల జూలై 11, 12 తేదీల్లో జిల్లా కేంద్రంలో 36 గంటల పాటు నిరసన చేపడతామని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి ప్రభుత్వానికి హెచ్చరించారు. అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి డి.శార్వాణికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చాలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా జీతం, గ్రాడ్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, జీతంలో సగం పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెల్పర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. వయో పరిమితి 50 ఏళ్లకు పెంచాలన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. సీనియారిటీ ప్రకారం వేతనాలు చెల్లించాలని, సూపర్‌వైజర్ పోస్టులకు వయో పరిమితి తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి బి.ఆదిలక్ష్మి, వివిధ సెక్టార్ల కార్యకర్తలు ఎస్.ఉమాభాయి, బి.ఈశ్వరమ్మ, ఎస్.సుమతి పాల్గొన్నారు.

**కొత్తూరు :** అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కార్యకర్తలు కోరారు. ఈ మేరకు ఐసిడిఎస్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.ధనలక్ష్మి, జలజాక్షి, రజని, లక్ష్మి, సరస్వతి, రామలక్ష్మి పాల్గొన్నారు.

గురుదాస్ మృతదేహం

## ముంగన్నకొండ క్వారీలో కార్మికుడు మృతి

**బూర్జ :** మండలంలోని కొరగాం పంచాయతీ ముంగన్నకొండ వద్ద గురువారం సాయంత్రం రాళ్ల బ్లాస్టింగ్ చేస్తుండగా గురుదాస్ అనే వ్యక్తి మృతి చెందారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన గురుదాస్ ముంగన్నకొండ క్వారీలో రాళ్లు కొట్టే కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బాంబు బ్లాసింగ్ సమయంలో రాళ్లు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. యాజమాన్యం సకాలంలో వైద్యం అందించకపోవడంతో పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తోటి కార్మికులు తెలిపారు. రాళ్ల బ్లాసింగ్ సమయంలో పూర్తిభద్రత కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. ఈ విషయంపై ఎస్ఐ అశోక్‌బాబును వివరణ కోరగా గురుదాస్‌పై రాళ్లు పడడంతో మృతి చెందాడని, దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నానని తెలిపారు.

## రైల్వే బోగీలో స్పృహ కోల్పోయిన వృద్ధురాలు

108లో తరలిస్తున్న సిబ్బంది

**జి.సిగడాం :** కేంద్రంలో రైల్వేస్టేషన్‌లో రెండు రోజుల నుంచి ఆగి ఉన్న రైల్వే భోగిలో స్పృహ కోల్పోయిన వృద్ధురాలు రైల్వే సిబ్బంది కంటపడింది. విశాఖపట్నం నుంచి పలాస వెళ్లే రైలు మార్గంలో మరమ్మతుల గురైన రైల్వే భోగిని జి.సిగడాం రైల్వేస్టేషన్లో నిలుపుదల చేసి ఉంచారు. ఆ రైల్వే భోగిల్లో శుక్రవారం రైల్వే సిబ్బందికి గుర్తు తెలియని మహిళ అందులో స్పృహ కోల్పోయి కనిపించింది. రైల్వే సిబ్బంది వెంటనే 108కి ఫోన్ చేశారు. వెంటనే 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి వివరాలు సేకరించారు. అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. రాజ్‌కుమారి అని, తనిది ఛత్తీస్‌గఢ్ అని తెలిపారు. ఇంకా ఆమె గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

మద్యం సీసాలను స్వాధీనం చేస్తున్న ఎస్ఇబి అధికారులు

## మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కొంచాడ, కింతలి గ్రామాల్లో అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్ఇబి ఎస్ఐ ఎన్ని చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని కొంచాడ పంచాయతీ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రాత్రి అక్రమంగా మద్యం సీసాలతో పొట్నూరు వరదరాజులుని పట్టుకుని ఆయన వద్ద గల 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. అలాగే శ్రీకాకుళం ఎస్ఇబి సిఐ రాజులనాయుడు శుక్రవారం సిబ్బందితో కలిసి కింతలిలో తనిఖీలు చేపట్టగా... అదే గ్రామానికి చెందిన గురుగుబెల్లి శ్రీనివాసరావుని పట్టుకుని అతని వద్ద గల 125 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. దీనిపై కేసులు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఖైదీతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

## జైళ్ల సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అంపోలులోని జిల్లా కేంద్ర కారాగారం, నరసన్నపేట సబ్‌జైల్‌ను శుక్రవారం సందర్శించారు. అక్కడ ఖైదీలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వేడిగాలులను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అలాగే నాణ్యమైన ఆహారం అందిస్తున్న తీరును ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అవసరమైతే వారి ఆర్థిక స్థోమతను బట్టి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. అవసరమైన వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జైలులో ఉన్నప్పుడు ప్రవర్తనలో మార్పు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ నబి ఖాన్, జైలర్ దివాకర్ నాయుడు, నరసన్నపేట జైలు అధికారులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' కూలీల ఆందోళన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఎండలు మండుతుండడంతో ఉదయం 8 దాటితే ఎండవేడికి ప్రజలు బయటకు రాని పరిస్థితి, ఇలాంటి సమయంలో ఉపాధి హామీ చట్టం ద్వారా వారం రోజులు కష్టపడి పనిచేస్తే నాలుగు రోజులకు మాత్రమే మస్టర్ వేశారని కోటబొమ్మాళి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయానికి చేరుకుని శుక్రవారం చేసుకుని ఆందోళనలు చేపట్టి ఎపిఒ అరుణ్‌కుమార్‌ను నిలదీశారు. రోజూ సమయానికి వెళ్లి పని చేయాలని, రోజుకు రూ.270 వరకు కూలి చెల్లిస్తామని అధికారులు సమావేశాలు పెట్టి మరీ చెప్పారని అన్నారు. కానీ ఏ ఒక్క కూలికీ రూ.220కు మించి డబ్బులు పడడం లేదని, అది కూడా వారానికి ఆరు రోజులు పనులు చేస్తే నాలుగు రోజులకు లెక్క కట్టి డబ్బులు జమ చేస్తున్నారని అన్నారు. ఏడు వారాలు అవుతున్నా ఇప్పటివరకు మా ఖాతాల్లో డబ్బులు జమకాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ సునీత పిల్ల కాలువల్లో విష సర్పాలకు, ఎండకు లెక్కచేయకుండా గుర్రపు డెక్కలను రెండు వారాలుగా పనులు చేసి తొలగించామని అన్నారు. తీరా పనులు అయిపోయాక కాలువ పనులకు డబ్బులు చెల్లింపులు లేదని అన్నారు. కూలీలందరూ ఒక్కసారిగా చేరుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఉపాధి హామీ అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలు తెల్పుకుంటామని కూలీలు వెనుతిరిగారు. ఈ విషయంపై క్లస్టర్ జెఇ జి.హరిప్రసాద్‌ను వివరణ కోరగా... చేసిన పనులు అన్నింటికీ బిల్లులు పడతాయని, కూలీలు ఆందోళన చెందాల్సిన పని లేదని అన్నారు.

ఆందోళన చేస్తున్న కూలీలు

## 'జగనన్న సురక్ష'కు ప్రణాళికలు

ప్రజాశక్తి- జి.సిగడాం

ఈ నెల 23 నుంచి జులై 23 వరకూ నెల రోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపిడిఒ కె.నిశ్చల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన పత్రాలు, ధ్రువపత్రాలు, ప్రభుత్వ పథకాల సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ పనుల నిర్వహణకు మండలల అధికారులు స్థానికంగా సమావేశాలు నిర్వహించి తక్షణమే పరిష్కరించాలన్నారు. ఎవరి సమస్య అయినా తిరస్కరణకు గురైతే ఆ ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. అప్పటి వరకూ పరిశీలనకు నోచుకోని సమస్యను 24 గంటల్లోగా పరిష్కరించాల్సి ఉంటుందని అన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి తక్షణం వారికి ఆ పథకాలు లబ్ధి పొందేలా చేస్తామన్నారు. జగనన్న సురక్షలో వివిధ పథకాల కింద అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు 1న అర్హత పత్రాలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్ శ్రీనివాస్, ఎంఇఒ అరసాడ రవికుమార్, పి.సురేష్, సాహు, పైల జైరాం, రౌతు చైతన్యకుమారి, పప్పల శ్రీనివాసరావు, జ్యోతి శ్రీనివాస్, గోరు లిఖిత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ వేణుగోపాలరావు

## స్కూళ్లకు సెలవులు పొడిగించాలి

వినతిపత్రం అందజేస్తున్న రాజేష్

**కవిటి:** రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్నాయని, ఒంటిపూట బడులు వల్ల మిట్ట మధ్యాహ్నం రావడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి లోళ్ల రాజేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎంఇఒ ధనుంజయ మజ్జిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నుంచి రోజూ 38 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది విద్యార్థులు ఎండవేడిమికి అస్వస్థకు గురయ్యారని అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధకారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే విద్యార్థులకు సెలవులు ప్రకటించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంఇఒ ఈ విషయాన్ని ఉన్నతాధకారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

భోజనం ప్లేట్లు అందజేస్తున్న ఆనందరావు

## 'అన్నా క్యాంటీన్'కు ప్లేట్లు వితరణ

**కోటబొమ్మాళి:** స్థానిక మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌కు మండలంలోని శ్రీజగన్నాథపురానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు సాసుమంతు ఆనందరావు రూ.15 వేలు విలువ కలిగిన స్టీల్ ప్లేట్లను శుక్రవారం అందజేశారు. అన్నా క్యాంటీన్ ద్వారా వందల మంది పేదలకు రూ.5లకే రుచికరమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, కామేశ్వరావు, కోరాడ పెద్దగోవింద్, సకలాభక్తుల రాంకుమార్, బోయిన ఋత్విక్ పాల్గొన్నారు.

## ప్యాషన్ ప్లస్ బైక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రం దన్నానపేట వద్ద ఉన్న శ్రీలక్ష్మీనరసింహ హీరో షోరూంలో న్యూ మోడల్ హీరో ప్యాషన్ ప్లస్ బైక్‌ను ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం యజమాని గున్ను భాస్కరరావు మాట్లాడుతూ హీరో వాహనాలు ఎక్కువ మైలేజీ, నాణ్యత, మన్నిక హీరో ద్విచక్ర వాహనాలకే సాటి అన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ దన్నాన సీతారాం, టెలికాం డైరెక్టర్ బడి రాంబాబు, మహంతి సత్యనారాయణ, సిహెచ్ సురేష్‌కుమార్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

రిబ్బన్ కట్ చేస్తున్న సాయికుమార్

వరుణ్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

## వరుణ్ చక్రవర్తికి సన్మానం

**పోలాకి :** భవిష్యత్‌లో మరిన్ని ర్యాంకులతో మరింత పేరు తెచ్చుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి.బాలకృష్ణ అన్నారు. నీట్ టాప్ ర్యాంకర్ బోర వరుణ్ చక్రవర్తిని మండలంలోని తోటాడలో స్వగృహానికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు శుక్రవారం వెళ్లి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి పి.రమేష్, ప్రెసిడెంట్ సదాశివుని కృష్ణ, సెక్రటరీ వి.నాగరాజు, ఊన్న రంగనాథ్, సాహు, బాలగంగాధర్ పాల్గొన్నారు.

## జెవికె కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే వంద శాతం అక్షరాస్యత సాధ్యపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. పిలకా రాజ్యలక్ష్మి అన్నారు. మున్సిపల్‌లోని బిల్లుపడ ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన విద్యా దీవెన వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు జగన్ విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబంలో పిల్లలు చదువుకునేలా చేయాలనే ఉద్దేశంతో బడి పిల్లకు జగనన్న విద్యా కానుక ఉచిత కిట్లు, జగనన్న అమ్మఒడి, జగనన్న గోరు ముద్ద వంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నీలాచలం, కౌన్సిలర్లు నీలాపు లక్ష్మి, కౌన్సిలర్ ప్రతినిధులు బుడుపు త్రినాథ్, పిలక విజయ భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నందిగాం :** మండలంలోని పెంటవూరు ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌ఛార్జి జడ్యాడ జయరాం, పెంటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బిసి కాలనీలో ఎంపిపి పాఠశాలలో వార్డు మెంబరు అట్టాడ నారాయణరావు, బాలిక మోహనరావు, విద్యాకమిటీ చైర్మన్లు జగనన్న విద్యా కానుకలను పంపిణీ చేశారు.

ఇచ్ఛాపురం : కిట్లను అందజేస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

నందిగాం : కిట్లను అందజేస్తున్న నాయకులు

## పార్టీలకతీతంగా వార్డుల అభివృద్ధి

**పలాస:** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పార్టీలకతీతంగా అన్ని వార్డులనూ అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస అన్నపూర్ణ ఆశ్రమం సమీపంలో రూ.5 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతివార్డులోనూ సిసి రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. అత్యవసర ప్రాతిపదికన దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, మున్సిపల్ డిఇ బల్ల హరి, ఎఇ అవినాష్, గూన మన్మథ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

నగదును అందిస్తున్న సభ్యులు

## కిడ్నీ బాధితునికి అండ

### 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని జగతికి చెందిన లక్కోజు మల్లేశ్వరరావుకు మండలానికి చెందిన హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. ఇటీవల 'ప్రజాశక్తి'లో వచ్చిన ఆసరా లేదు ఆదుకోండి కథనానికి స్పందించి మల్లేశ్వరరావు కుటుంబాన్ని హెల్పింగ్ హేండ్స్ సంఘం సభ్యులు శుక్రవారం పరామర్శించారు. మల్లేశ్వరరావు వైద్యం కోసం తక్షణ సహాయంగా రూ.5 వేలు, నెలకు సరిపడే నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ దయనీయ పరిస్థితిలో ఉన్న రామారావును దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు.

## నీట్‌లో రాణించిన అక్షిత

అక్షిత

**ఆమదాలవలస :** పట్టణంలోని బి.ఆర్.నగర్‌కు చెందిన భాసూరు అక్షిత ఇటీవల విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో ఆల్ ఇండియా కేటగిరీలో 2039 ర్యాంకును సాధించింది. 720 మార్కులు గాను, 675 మార్కులు సాధించింది. అలాగే ఎపిఇఎపి సెట్‌లో 106వ ర్యాంకును, టిఎస్ ఎంసెట్‌లో 72వ ర్యాంకును సాధించింది. మూడు, నాలుగు, ఐదు తరగతులను పాలకొండలోని డివి స్కూల్, ఐదు, ఆరు, ఏడు తరగతులను జవహర్ నవోదయ విద్యాలయం వెన్నెలవలసలోనూ, తొమ్మిది, పదో తరగతులను శ్రీకాకుళంలోని శ్రీచైతన్య పాఠశాలలోనూ, ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్య గోశాలలో విద్యను అభ్యసించింది. తండ్రి సుధాకరరావు మండలంలోని కొర్లకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి మంజులత గృహిణి. కార్డియాలజిస్టు కావడమే తన లక్ష్యమని ఆమె తెలిపారు. ఈమె ర్యాంకులు సాధించడంపై బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

## బ్రిజ్ భూషణ్‌ని అరెస్టు చేయాలి

**టెక్కలి :** భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు బ్రిజ్ భూషణ్‌ని తక్షణమే అరెస్టు చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న మహిళా రెజ్లర్లపై లైంగికంగా వేధింపులకు గురి చేయడమే కాకుండా వారిపై కక్షపూరితంగా వ్యవహరించిన బ్రిజ్ భూషణ్‌ని ఎంపీ పదవికి అనర్హుడని అన్నారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని

## ఇంటింటికీ తాగునీరు
### శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఇంటింటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గాజులకొల్లివలస, ఆర్ఆర్ కాలనీలో రూ.1.14 కోట్ల వ్యయంతో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిల పనుల ప్రారంభానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యక్తికీ రోజుకు సగటున 55 లీటర్ల తాగునీటిని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా 2024 నాటికి ఇంటింటికీ కుళాయిల ద్వారా మంచి నీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని అన్నారు. నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభమైన ప్రతి గ్రామంలోనూ త్వరలో ఇంటింటికీ తాగునీరు అందించేలా గ్రామీణ నీటి సరఫరా అధికారులను సమాయత్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, వైసిపి నాయకులు బొడ్డేపల్లి శేఖర్, డాబా శ్యామ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరుపై పురపాలక సంఘం కార్యాలయంలో మహిళా సంఘాలతో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి శుక్రవారం సమీక్షించారు. మూడో వార్డుల నుంచి అమ్మాభవాని, పదో వార్డు నుంచి ఇందిరమ్మ, 11 వార్డు నుంచి మహాలక్ష్మి, 17 వార్డు నుంచి ప్రసన్నంజనేయ సంఘాల సభ్యులతో మెప్మా ఆధ్వర్యాన ఈ సమావేశం నిర్వహించారు. వైఎస్ఆర్ ఆసరా, సున్నావడ్డీ, రుణమాఫీ, వైఎస్ఆర్ చేయూత వంటి పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం పథకాలు మాత్రమే కాకుండా విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకూ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. విద్యకు సంబంధించి నాడు-నేడుతో స్కూల్ రూపురేఖలు మారిపోయాయని పేర్కొన్నారు. కార్పొరేట్ స్కూల్ స్థాయిలో తరగతి గదులు ఉన్నాయని అన్నారు. ప్రీ స్కూల్ నుంచి ఉచితంగా విద్యను అందిస్తున్నారని అన్నారు. వైద్యం విషయంలో ఆరోగ్యశ్రీ, కొత్తగా అర్బన్ హెల్త్ క్లినిక్‌లు పెట్టారని అన్నారు. వ్యవసాయానికి సంబంధించి రైతు భరోసా కేంద్రాలు నిర్మించారని అన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ఎచ్చెర్ల :** మాదక ద్రవ్యాల వాడకం వల్ల జీవితం చిన్నాభిన్నమవుతుందని, వారి కుటుంబాల్లో తీరని వేదనను మిగులుస్తుందని వికలాంగుల శాఖ ఎడి కె.కవిత అభిప్రాయపడ్డారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీలో మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. నాసా ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వాడకాన్ని అరికట్టేందుకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.హెచ్.రాజేంద్రప్రసాద్, జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ ఆర్.సన్యాసినాయుడు, సీడాప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాజు పాల్గొన్నారు.

పట్టాను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

## ముస్లిముల నమాజ్‌కు స్థలం కేటాయింపు

**ఆమదాలవలస :** పట్టణంలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న ముస్లిములకు నమాజ్ కోసం మంజూరు చేసిన స్థల పట్టాను స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శుక్రవారం ముస్లిం పెద్దలకు అందజేశారు. గతంలో నమాజ్ చేసుకునేందుకు, అలాగే పండగలు నిర్వహించుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని ముస్లిం పెద్దలు స్పీకర్‌కు వినతి పత్రాన్ని అందించారు. పట్టణంలోని మెట్టక్కివలస పరిధిలోని ముస్లిం కాలనీలో ఉన్న జెండా ప్రాంతంలో కొంత స్థలాన్ని కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన స్పీకర్ స్థల కేటాయింపులకు సంబంధించిన చర్యలు తీసుకోవాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముస్లిం కాలనీలో అందుబాటులో ఉన్న అదనపు స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి సంబంధించిన పట్టాను మంజూరు చేశారు. దీంతో ముస్లిం పెద్దలు స్పీకర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. మత గురువు ఆలీ అహ్మద్, ముస్లిం పెద్దలు జిలాని, జలీల్ భాయ్, అబ్బు, బుఖారి, మక్బూల్, యాసిన్ పాల్గొన్నారు.

# విద్యా ప్రగతికి జగనన్న ఆణిముత్యాలు

ప్రజాశక్తి- బూర్జ

విద్యాప్రగతికి జగనన్న ఆణిముత్యాలు, అత్యుత్తమ విద్య సమపార్జనే విజయాలకు సోపానమని ఎంపిపి కర్నేన దీప అన్నారు. మండలంలోని కొల్లివలస డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ అధ్యక్షతన పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పేరిట శుక్రవారం సత్కరించి మెమోంటోలను అందజేశారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు, మోడల్స్, పురస్కార పత్రాలను అందజేశారు. విద్యార్థి నుంచే మంచి ప్రణాళికతో విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జగనన్న ఆణిముత్యాల పేరిట సత్కరించడం గొప్ప విషయమన్నారు. జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే జగనన్న ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో కొల్లివలస, చీడివలస సర్పంచ్‌లు జీడి వేణు, బూరి శ్రీరాములు, మామిడివలస ఎంపిటిసి గుమ్మడి

నందిగాం: ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

రాంబాబు, పిఎంసి చైర్మన్ నారాయణరావు పాల్గొన్నారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు.

**నందిగాం:** విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హరిబాబు ఆధ్వర్యాన జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సంపాదించిన విద్యార్థినులకు ప్రభుత్వం అందజేసిన రూ.3 వేలు, రూ.2 వేలు ప్రోత్సాహంతో పాటు సర్టిఫికెట్, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఎ.విష్ణు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సనపల చిన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** మండలంలో ఈదుపురం గ్రామ పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పది, ఇంటర్‌లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు ప్రసాద్‌లు సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎన్.శ్రీను, హెచ్‌ఎం భాస్కరపాడి, ఎస్ఎంసి బెహరా పాల్గొన్నారు.

**జి.సిగడాం :** స్థానిక కెజిబివిలో ప్రిన్సిపాల్ ఉషారాణి అధ్యక్షతన పది, ఇంటర్‌లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి అలపాని భూమికకు రూ.3 వేలు, రెండో బహుమతి ఆర్.కళ్యాణికి రూ.2 వేలు, తృతీయ బహుమతి వై.శ్రావణికి రూ.వెయ్యి నగదు, మెడల్స్‌తో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ సత్కరించారు. అనంతరం జగనన్న విద్యా కిట్లను అందించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాయల రమణ, ఎంఇఒ అరసాడ రవి, మండల పార్టీ అధ్యక్షుడు బురాడ వెంకటరమణ పాల్గొన్నారు.

పొందూరు : పోస్టర్‌ను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

# గడపగడపకు సంక్షేమం

**పొందూరు :** సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తండ్యాంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని గడపగడపకూ వెళ్లి ప్రజలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎంపిటిసి ప్రతినిధి వడగ మోహనరావు, ఎడి శ్రీనివాసరావు, ఎఒలు బెండి బాబ్జి, మోహనరావు, పద్మనాభం, రాజేష్ పాల్గొన్నారు.

**రణస్థలం:** సమస్యలు తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తెప్పలవలస గ్రామ సచివాలయం పరిధిలోని కొత్తపేట, చిన్నపట్నానపేట, నీలంపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, ఎంపిడిఒ జి.వి.రమణ పాల్గొన్నారు.

రణస్థలం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

## 'జగనన్నకు చెబుదాం' సమస్యలు పరిష్కరించాలి

సమీక్షిస్తున్న రాజగోపాలరావు

ప్రజాశక్తి- జలుమూరు

ప్రతి సోమవారమూ నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అన్ని సమస్యలను అధికారులు పరిష్కరించే దిశగా కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.రాజగోపాలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జగనన్నకు చెబుదాంలో వివిధ శాఖలకు వచ్చిన అర్జీలు ఎన్ని పరిష్కరించినవి, ఎన్ని ఇంకా పరిష్కరించాల్సిన విషయం అని ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. జగనన్నకు చెబుతాంలో వచ్చిన అన్ని సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఐ.వి.అప్పారావు, డిటి పి.శ్రీనివాస్, పంచాయతీ విస్తరణ అధికారి పి.ఉమామహేశ్వరరావు, ఎంఇఒ బమ్మిడి మాధవరావు, వైద్యాధికారి టి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పలువురికి ఆర్థికసాయం

**మెళియాపుట్టి :** మండలంలో చాపరలో టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు వృద్ధులు ముదిలి సోమేష్, తెంబ చిలకమ్మ, గుత్తిలి బోగమ్మ, పవిడి వరాలమ్మ, బొద్ద సూరమ్మ, గూడెం చిన్నమ్మిని కలిసి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అందరికీ కలిపి రూ.16 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యపరంగా ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తనను సంప్రదిస్తే తప్పకుండా సహాయం అందుతుందని భోసారా ఇచ్చారు. వృద్ధుల చికిత్స నిమిత్తం శ్రీఆకకుళంలోని హెల్త్ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో వెంకటేష్, సారథి, తిరుమల, సింహాచలం, భద్రం, భాస్కరరావు, త్రినాధులు పాల్గొన్నారు.

**టెక్కలి రూరల్:** కవిటి మండలం బొగిడియపుట్టుగకు చెందిన చెన్నూరు జగన్నాథరావు బ్రెయిన్‌లో నీరు

మెళియాపుట్టి : ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

చేరడంతో ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకున్నారు. మందులు కొనుగోలుకు డబ్బులు లేని పరిస్థితిని తెలుసుకుని అభయం సేవా సంఘం రూ.6 వేలు అందజేసినట్లు అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలిపారు.

**శ్రీకాకుళం :** స్థానిక మండల వీధిలో నివాసముంటున్న రాజశేఖర్ గతేడాది మృతి చెందారు. దీంతో మూడేళ్ల కుమార్తెతో ఇంటిపోషణ కష్టతరమవుతుంది. విషయం తెలుసుకున్న మౌతుందని రాజశేఖర్ మిత్రుడుకలివరపు సూర్యప్రకాష్ రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గన్నవరపు నరసింహమూర్తి, దేవాది రామరాజు పాల్గొన్నారు.

### కోదండ రామాలయం
## ఆస్తులను పరిరక్షించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో పురాతన ఆలయాల్లో ఒకటైన పాలకొండ రోడ్‌లోని కోదండ రామాలయానికి పెద్ద మొత్తంలో ఆస్తులు ఉన్నాయని, వాటిని సంరక్షించాలని ట్రస్టు బోర్డు చైర్మన్ చెట్టు నాగేశ్వరరావు కోరారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు శుక్రవారం ఒక లేఖ రాశారు. ఆలయానికి వందల ఎకరాల ఆస్తులు ఉన్నా... వాటి నుంచి అనుభవదారులు శిస్తులు చెల్లించడం లేదని అన్నారు. ఆదాయం సరిపడినంత రాక దీప ధూపనైవేద్యాలకు నిధులు కొరత ఏర్పడిందని వివరించారు. నరసన్నపేట మండలం పోతయ్యవలసలో రూ.కోట్ల విలువ చేసే వందల ఎకరాలు భూములు ఆలయానికి చెందినవేనన్నారు. పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు సమస్య పరిష్కరించాలని కోరినా... ఫలితం కనిపించడం లేదన్నారు. శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాలకు ధర్మాన సోదరులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, అందువల్ల అక్కడి రైతులతో చర్చింది ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

## యోగాతో ఆరోగ్యం

**జలుమూరు:** రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని తలతరియ సచివాలయ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రూపవతి అన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని టి-లింగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక యోగా తరగతులను నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రత్యేక యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక రకాల వ్యాధులకు యోగా ద్వారా ఉపశమనం కలిగించవచ్చన్నారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు కరుణ, లత పాల్గొన్నారు.

జ్ఞాపికను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

## అరసవల్లి సందర్శన

**శ్రీకాకుళం అర్బన్ :** అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని అనంతపురం జిల్లా గుంతకల్ ఎమ్మెల్యే యల్లారెడ్డిగారి వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. స్వామివారికి నిర్వహించే పలు సేవల్లో పాల్గొన్న అనంతరం ఆయనకు అనివేటి మండపంలో స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో అర్చకలు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందజేస్తున్న శార్వాణి

## అంగన్వాడీలకు నియామక పత్రాలు

**పలాస:** విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు సకాలంలో అందేలా చూడాలని కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి డి.శార్వాణి సూచించారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శుక్రవారం పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు నూతనంగా ఎంపికైన అంగన్వాడీ కార్యకర్తలకు, మినీ అంగన్వాడీ కార్యకర్తలకు ఆయాలకు నియామక పత్రాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సంబంధించి 9 మంది అంగన్వాడీ, మినీ అంగన్వాడీ, ఆయా పోస్టులకు నియామక పత్రాలు అందజేశానని తెలిపారు. ఆమెతో పాటు యుడిసి అప్పారావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

## 'జన్‌భాగీదారి' సైకిల్ ర్యాలీ

**శ్రీకాకుళం అర్బన్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలోని గూనపాలెం ప్రాంతంలో జన్‌భాగీదారి కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ గూనపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ బి.యోగేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు తలగాన రాజేశ్వరి, ఎన్.పార్వతి, బి.సరస్వతిదేవి, డి.మత్యాలమ్మ, సునీత, ఆదిలక్ష్మి, చిన్నమ్ములు, ఉమాదేవి, ప్రమీలాదేవి పాల్గొన్నారు. పిల్లలందరూ స్కూల్‌కి రావాలని, పిల్లలందరినీ తల్లిదండ్రులు బడికి పంపాలంటూ ర్యాలీ నిర్వహించారు. తోటకి పువ్వులందం, బడికి పిల్లలు అందం, పెద్దలు పనికి, పిల్లలు బడికి, బాలకార్మికులను నిర్మూలిద్దామంటూ నినాదాలు చేశారు.

## మజ్జిగ పంపిణీ

**శ్రీకాకుళం అర్బన్ :** తమ అభిమాన నటుడు ప్రభాస్ నటించిన ఆదిపురుష్ చిత్రం విడుదల సందర్భాన్ని పురస్కరించుకుని అభిమానులు నగరంలోని పలు సినిమా థియేటర్ల వద్ద శుక్రవారం మజ్జిగను పంపిణీ చేశారు. పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల నగర వాసులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మజ్జిగను పంచిపెట్టామని ప్రభాస్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు పైడి రాజు సల్మాన్‌శంకర్ తెలిపారు. కార్యక్రమంలో అభిమానులు ఎర్రయ్య, అప్పన్న పాల్గొన్నారు.

మజ్జిగను పంపిణీ చేస్తున్న అభిమానులు

## వైసిపి బలోపేతానికి కృషి

**లావేరు :** మండలంలోని వైసిపి బలోపేతానికి కృషి చేయాలని సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు కార్యకర్తలకు హితబోధ చేశారు. మండలంలోని మురపాక, కేశవరాయుపాలెం, లోపెంట గ్రామాల్లో శుక్రవారం పర్యటించి కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బల్లాడ జనార్ధనరెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధి జరుగుళ్ల శంకరరావు, మీసాట జగన్, మురపాక ఎంపిటిసి తేనెల సురేష్‌కుమార్ పాల్గొన్నారు.